# నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 24 జూన్ 2025 | RANGAREDDY




## అదనపు డ్యూటీలు రద్దు చేయాలి

వికారాబాద్ : అంగన్‌వాడీ టీచర్లతో బీఎల్వో అదనపు డ్యూటీలు రద్దు చేయాలని, అధికారుల వేధింపులు ఆపాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భారతి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, అంగన్‌వాడీ టీచర్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



## 'ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి'

బొంరాస్‌పేట, జూన్ 23 : ప్రభుత్వ పాఠశాలల పనితీరును పర్యవేక్షించేందుకు ఉపాధ్యాయులను తనిఖీ అధికారులుగా నియమిస్తూ విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, ఆలీముద్దీన్ కోరారు. ఉన్నత పాఠశాలల్లో గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పనిచేస్తున్న వారికన్నా తక్కువ స్థాయి ఉన్న స్కూల్ అసిస్టెంట్లను పర్యవేక్షకులుగా నియమించడం సమంజసం కాదన్నారు. అంతేకాకుండా బడుల్లో బోధన కుంటుపడడంతోపాటు టీచర్ల కొరత మరింత పెరుగుతుందన్నారు. ఆ ఉత్తర్వులను ఉన్నతాధికారులు పునఃసమీక్షించాలన్నారు.

- ఎలిమినేడు పంచాయతీ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన
- ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం
- ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

## భరోసా ఇచ్చేవరకూ
# నిరసన ఆగదు..



ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

ఇబ్రహీంపట్నం, జూన్ 23 : రైతులందరికీ రైతుభరోసా ఇచ్చేవరకూ తమ పోరాటం, నిరసనలు ఆగవని బీఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం మండలాధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్, సహకార సంఘం చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎలిమినేడు గ్రామంలో శివారు గ్రామాల్లో ఉన్న రైతులందరికీ రైతుభరోసా అందించాలని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ హయాంలో అర్హులందరికీ రైతుభరోసా సాయం అందించిదని.. కానీ, కాంగ్రెస్ పార్టీ కొన్ని మండలాల్లోని రైతులకు కోత విధించడం తగదని హెచ్చరించారు. రైతులందరికీ రైతుభరోసా అందించే వరకూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. రేవంత్ ప్రభుత్వం తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ రైతు మొద్దు అంజిరెడ్డి, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్వర్, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, శేఖర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రైతులందరికీ రైతుభరోసాను తక్షణమే అందించాలని సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామ్యూల్ మాట్లాడుతూ.. ఔటర్‌రింగ్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న జిల్లాలోని 9 మండలాల్లోని రైతులకు పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జంగయ్య, జగన్, బుగ్గరాములు, ఎల్లేశ్, గణేశ్, వెంకటేశ్, నర్సింహ, భిక్షపతి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.




ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

## కాలయాపన కోసం..
# మరో సర్వే

- ఫార్మా బాధిత రైతులు

## ఇండ్ల స్థలాలపై ఫ్యామిలీ ట్యాగ్ సర్వే

- ప్రారంభించిన రెవెన్యూ అధికారులు



ఆకులమైలారం గ్రామపంచాయతీలో నిర్వహించిన సర్వేకోసం వచ్చిన బాధిత రైతులు

- గత సంక్రాంతికే ఇండ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని ప్రకటించిన రేవంత్ ప్రభుత్వం..
- అయినా ఇప్పటివరకు కేటాయించని వైనం
- ఇండ్ల స్థలాల అంశాన్ని అటకెక్కించేందుకే అంటూ భూబాధితుల మండిపాటు

రంగారెడ్డి, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : ఫార్మాసిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి భూములిచ్చిన రైతులకు ఇవ్వాల్సిన ఇంటి స్థలాలపై ప్రభుత్వం మరోమారు సర్వే ప్రారంభించింది. ఫ్యామిలీ ట్యాగ్ పేరుతో బాధిత గ్రామాల్లో రెవెన్యూ అధికారులు కొత్తగా సర్వేను షురూ చేశారు. భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ఇవ్వాలనుకున్న ఎకరానికి గుంట చొప్పున భూమిని ఒకే చోట ఇవ్వాలా....లేక రైతులు కోరుకున్న చోట ఇవ్వాలా..? అన్న విషయంపై సర్వే చేస్తున్నారు. ఈ సర్వేను మరింత కాలయాపన చేసేందుకేనని రైతులు భావిస్తున్నారు. రైతులు గత ప్రభుత్వానికే భూములిచ్చారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ భూముల్లో సర్వే చేసి కంచెను కూడా ఏర్పాటు చేసింది. ఫెన్సింగ్ లోపల వర్షాకాలంలో పంటలు వేయొద్దని ఇప్పటికే రైతులకు అధికారులు సూచించారు. అయితే, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భూములిచ్చిన రైతులకు ఎకరానికి 120 గజాల చొప్పున ఇంటిస్థలం ఇవ్వాల్సి ఉన్నది. ఈ ఇండ్ల స్థలాల కోసం గత కేసీఆర్ ప్రభుత్వం మీర్‌ఖాన్‌పేట వద్ద భూమిని కేటాయించి ప్లాట్లుగా మార్చింది. ఆ ప్లాట్లకు సర్టిఫికెట్లను కూడా అందజేసింది. అనంతరం అసెంబ్లీ ఎన్నికలొచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ ప్లాట్లను రైతుల పేరున రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సి ఉండగా.. గత 18 నెలలుగా పట్టించుకోవడమే లేదు. గత సంక్రాంతి నాటికే రైతులందరికీ రిజిస్ట్రేషన్లు చేసి ప్లాట్లు కేటాయిస్తామని ప్రకటించినా ఇప్పటివరకూ ఆ ఊసే ఎత్తడంలేదు.

### కొత్తగా ఫ్యామిలీ ట్యాగ్ సర్వే..

ఫార్మాసిటీ ఏర్పాటుకోసం ప్రభుత్వానికి యాచారం మండలంలో 979 మంది, కందుకూరు మండలంలో 668 మంది రైతులు భూములిచ్చారు. కందుకూరు మండలంలో 1,300 మందికి, యాచారం మండలంలో 3,745 రైతులకు ఇండ్లస్థలాల పట్టాలు ఇవ్వాల్సి ఉన్నది. ఇండ్ల స్థలాలను కేటాయించే విషయంలో కొత్తగా ఫ్యామిలీ ట్యాగ్ సర్వే అని గ్రామాల్లో మరో సర్వేకు ప్రభుత్వం తెరలేపింది. ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతు కుటుంబాల్లో భూములు ఎక్కువగా పోయినందున ఒక్కొక్కరికీ నాలుగు నుంచి ఐదు ప్లాట్ల వరకు వస్తాయి. ఈ ప్లాట్లన్నీ ఒకేచోట ఇవ్వాలా..? వేర్వేరుగా ఇవ్వాలా ..? అనే దానిపై అధికారులు ఫ్యామిలీట్యాగ్ సర్వేను చేపడుతున్నారు. అధికారులు గ్రామాలకొచ్చి సర్వేగురించి వివరించి సంతకాలు చేయాలని అడుగుతున్నారు. కానీ, రైతులు మాత్రం సంతకాలు చేయడంలేదు. సంతకాలు చేయించుకున్న తర్వాత ప్లాట్లు ఇస్తారో..? లేదో ..? అన్న అనుమానం వారిలో మొదలైంది. ఈ సర్వే ప్లాట్ల కేటాయింపును మరింత జాప్యం చేసేందుకేనని వారు చర్చించుకుంటున్నారు.

### ఇంటి స్థలాలు ఇప్పట్లో వచ్చేనా..?

భూములిచ్చిన రైతులకు ప్లాట్లు కేటాయించేందుకు గత ప్రభుత్వం అత్యాధునిక వసతులతో వెంచర్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాకుండా సర్టిఫికెట్లను కూడా కేటాయించినా ఇప్పటివరకు ఇంటిస్థలాలను మాత్రం చూపలేదు. మరోవైపు బాధిత రైతులు ఎక్కువగా ఉండడంతో ప్లాట్లు తక్కువగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ ప్లాట్ల నుంచే 330 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కూడా వెళ్తున్నది. ఇప్పటికే రైతులకు సరిపడా ప్లాట్లు లేకపోగా.. మరోవైపు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కూడా వెళ్తుండడంతో మరికొన్ని ప్లాట్లు రోడ్డులో పోయే ప్రమాదం ఉన్నది. కొత్తగా మరికొన్ని ప్లాట్లుచేసి ఇస్తామని అధికారులు చెబుతున్నా రైతులు నమ్మడంలేదు. దీంతో బాధిత రైతులకు ఇప్పట్లో ఇంటి స్థలాలు వస్తాయా..? అనేది పలు అనుమానాలకు దారి తీసింది.

## మున్సిపాలిటీల్లో
# కంపు..కంపు..

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

### వికారాబాద్ జిల్లాలో లోపించిన పారిశుధ్య నిర్వహణ

- చిన్న వర్షానికే రోడ్లపై పొంగుతున్న డ్రైనేజీ నీరు
- మురుగునీటితో కలుషితమవుతున్న తాగునీరు
- రోగాల బారిన ప్రజలు




మోరీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

వికారాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో ఎక్కడ చూసినా మురుగు నీరే దర్శనమిస్తున్నది. చిన్నపాటి వానకే డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతుండడంతో జనాలు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా మురుగు నీటితో రోడ్లన్నీ కంపు..కంపుగా మారిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. అంతేకాకుండా పట్టించుకోవాల్సిన ప్రత్యేకాధికారులు కూడా ప్రేక్షక పాత్ర వహిస్తుండడం గమనార్హం. జిల్లాలోని మున్సిపాలిటీల్లో తడి, పొడి చెత్త సేకరణ మినహా పారిశుధ్య నిర్వహణ పనులను ఆయా మున్సిపాలిటీల అధికారులు, సిబ్బంది గాలికొదిలేశారు. గత ఆరు నెలలుగా పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రధాన రహదారులతోపాటు పలు కాలనీల్లోని రోడ్లపై నిత్యం మురుగు నీరు పారుతుండడంతో ప్రధాన కూడళ్ల వద్ద కూడా ప్రజలు నిలబడలేని పరిస్థితి నెలకొన్నది. ఇటీవల కురిసిన మోస్తరు వర్షానికే నాలుగు మున్సిపాలిటీల్లోని రోడ్లపై డ్రైనేజీ నీరు పొంగిపొర్లింది. మురుగు నీరు పారుతుండడంతో తాగునీరు కూడా కలుషితం అవుతున్నది.

### ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో మురుగు నీరు రోడ్లపై పారుతుండడంతో దోమలు పెరిగిపోతున్నాయి. మురుగు నీటితో తాగునీరు కలుషితం అవుతుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో చలి జ్వరాలతో ఆసుపత్రులకు క్యూ కడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. వర్షాలు పడుతుండడంతో నీటి కాలుష్యం పెరగడంతోపాటు డ్రైనేజీ నీరు తాగునీటి పైపుల్లోకి చేరడంతో డయేరియా, కామెర్ల వ్యాధులు వచ్చే అవకాశమున్నది. వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లోని పలు కాలనీల్లో వర్షం పడిన సమయంలో డ్రైనేజీలు నిండి ఇండ్లలోకి వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. పిల్లలకు జ్వరం, జలుబు, దగ్గు వచ్చినట్లయితే దవాఖానలకు తీసుకెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.



ఇండ్ల మధ్యనే మురుగునీరు



బైపాస్ నిర్మాణం కోసం తవ్విన గుంత

## నిర్లక్ష్యం ప్రాణం తీసింది

మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసం..

గుంతలో నిలిచిన నీళ్లు..

అందులో పడి మహిళ మృతి

IV వ పేజీలో..

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ
- కేశంపేట జడ్పీహెచ్‌ఎస్‌లో డ్రగ్స్‌పై అవగాహన

II వ పేజీలో..



# ఊరించి.. ఉసూరుమనిపించి..

- గత నెలాఖరు.. ఈ నెల ప్రారంభంలో సమృద్ధిగా కురిసిన వానలు
- దుక్కులు దున్ని పత్తి పంటను సాగు చేసిన అన్నదాత
- గత పది రోజులుగా మొహం చాటేసిన వానదేవుడు
- ఎండిపోతున్న పత్తి పంట
- ఆందోళనలో అన్నదాత



మొలక దశలోనే ఎండిపోతున్న పత్తి విత్తనాలు

రంగారెడ్డి, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని అన్నదాతను మే నెల ఊరించగా.. జూన్ నెల ఉసురు తీస్తున్నది. మే, జూన్ నెల మొదట్లో జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురువడంతో అన్నదాత పెద్ద ఎత్తున పత్తి పంటను సాగు చేశాడు. యాచారం, మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు తదితర మండలాల్లో 50 శాతానికిపైగా రైతులు పత్తి విత్తనాలు వేశారు. ఈ నెల మొదట్లో వర్షాలు కురువడంతో ఆ విత్తనాలు మొలకెత్తాయి. గత పది రోజులుగా వాన కురువకపోవడంతో పత్తిపంట ఎక్కడికక్కడ ఎండిపోతున్నది. వర్షాల కోసం అన్నదాత ఆకాశం వైపు చూస్తున్నాడు. జిల్లాలోని పలు మండలాల్లో అన్నదాత పత్తి పంటను సాగు చేసేందుకు అధికంగా పెట్టుబడులు పెట్టాడు. పంట మొలకెత్తే సమయంలో వర్షాలు పడకుంటే మొత్తం ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. రెండు, మూడు రోజుల్లో వర్షాలు పడితే ఏమి కాదని.. వానలు పడకుంటే పంట మొత్తం ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

### 70,000 ఎకరాలకు పైగానే..

జిల్లాలో రుతుపవనాలు ముందుగానే రావడంతో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. మే నెలతోపాటు జూన్ మొదటి వారంలో వర్షాలు సమృద్ధిగా కురువడంతో పత్తి పంటను అధికంగా సాగు చేశారు. జిల్లాలో 70,000 ఎకరాలకు పైగా ఆ పంటను సాగు చేసినట్లు సమాచారం. మే నెలాఖరు, జూన్ ప్రారంభంలో వానలు ఊరించి.. ఇప్పుడు వాన దేవుడు మొహం చాటేయడంతో అన్నదాత తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. నాటిన విత్తనాలు ఎండిపోయే ప్రమాదం ఉన్నదని పేర్కొంటున్నాడు. వానలకోసం ఆశగా ఆకాశం వైపు చూస్తున్నాడు.

### కురవని వాన.. ఎండుతున్న పంట



ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవడంతో దుక్కులు దున్ని పత్తి విత్తనాలను వేశా. పత్తి మొలక రాగానే వాన దేవుడు మొహం చాటేయడంతో పూర్తిగా ఎండుముఖం పట్టింది. అప్పులు చేసి పత్తి విత్తనాలు వేశా. ఎండిపోతే నా పరిస్థితి అంతే.. వాన దేవుడా కరుణించు..

-మైసయ్య, మాడ్గుల

### ఎండిపోతున్న పత్తిపంట



మే నెలాఖరు, ఈ నెల ప్రారంభంలో కురిసిన వానలతో పత్తి పంట వేశా. తీరా మొలకలు వచ్చే సమయంలో వానదేవుడు మొహం చాటేయడంతో పంట మొత్తం ఎండిపోతుంది. వాన దేవుడు ముందు మురిపించి..తర్వా ఉసురు తీస్తున్నాడు. రెండు, మూడు రోజుల్లో వానలు కురవకుంటే మొత్తం పంట ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది

-శంకరయ్య, మాడ్గుల మండలం